క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం


పరిసరాలను శుభ్రం చేస్తున్న నాయకులు

జ్యోతినగర్: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం లభిస్తుందని ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు ఉద్యోగ గుర్తింపు సంఘం (ఐఎన్టీయూసీ-ఎన్ఎంయూ) వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కృష్ణయ్య అన్నారు. శనివారం ప్రాజెక్టు పర్మనెంట్ టౌన్‌షిప్‌లో స్వచ్ఛత పక్షోత్సవాల కార్యక్రమంలో భాగంగా మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో పాల్గొని ఆయన మాట్లాడారు. మన ఇంటి నుంచే స్వచ్ఛత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ జనరల్ సెక్రటరీ ఆరెపల్లి రాజేశ్వర్, నేరేళ్ల రమేశ్, కొలని వెంకట్‌రెడ్డి, చిట్టబోయిన భాస్కర్, మహేందర్, అంజయ్య, వెంకటస్వామి, బానేశ్వరరావుతో పాటు పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బీరన్న ఉత్సవాలు


బీర్ల పూజారుల విన్యాసాలు

జూలపల్లి: మండల కేంద్రంలో మహంకాళి బీరన్న కురుమ సంఘం ఆధ్వర్యంలో బీరన్న, కామరాతి, మహంకాళి ఉత్సవాలు కనుల పండువగా జరుగుతున్నాయి. శనివారం బీర్ల పూజారులు ప్రత్యేక వేషధారణతో జంబియాలు చేతి పట్టుకొని శోభాయాత్రగా గ్రామ శివారు బావిలో దాచిన దేవుని లింగాలను వెతికి బయటకు తీశారు. లింగాలను బీరన్న నామ స్మరణతో ఆలయానికి తీసుకువచ్చి ఆలయంలో ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు అధ్యక్షుడు ఎల్కపెల్లి లచ్చయ్య, ప్రధాన కార్యదర్శి బండారి రమేశ్, ఉపాధ్యక్షుడు బొప్పెనపల్లి రవి, సభ్యులు చీగుర్ల బీరయ్య, అమరగొండ ఐలయ్య, సలహాదారు బొప్పెనపెల్లి మల్లేశం, కోశాధికారి గుంటి రాయమల్లు, సహాయ కార్యదర్శి గుంటి అశోక్, సభ్యులు సభ్యులు, కుల పెద్దలు పాల్గొన్నారు.

ఆలయంలో మండల పూజ


పూజలో పాల్గొన్న భక్తులు

పాలకుర్తి: మండలంలోని కన్నాల గ్రామ పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన జరిగి 41రోజులు పూర్తయిన సందర్భంగా మండల పూజ నిర్వహించారు. చొప్పదండి మండలం రుద్రారంకు చెందిన ప్రముఖ వేదపండితులు విషణవర్ధనాచార్యుల ఆధ్వర్యంలో ఐదుగురు పూజారులతో కూడిన బృందం ప్రత్యేక హోమం, కలుష పూజ, అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసమర్పణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మురుగుకాలువ శుభ్రం

మంథని: మున్సిపల్ పరిధిలోని తమ్మిచెరువు కట్ట వాటర్ ట్యాంక్ నిండి నీరు వృథా పోవడంతో రోడ్డుపై మురుగు పేరుకుపోయింది. వాహనదారులకు కలుగుతున్న అసౌకర్యంపై స్పందించిన మున్సిపల్ చైర్‌పర్సన్ పెంద్రి రమ శనివారం మురుగును శుభ్రం చేయించారు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి మురుగు నీరు సైతం రోడ్డుపైకి వస్తుండడంతో మురుగు కాలువలను శుభ్రం చేయించారు.

గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని గవర్నర్‌కు వినతి

మంథని: మండలంలోని రచ్చపల్లి పంచాయతీ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌కు వినతిపత్రం అందించినట్లు గ్రామ మాజీ సర్పంచ్ కనవేన శ్రీనివాస్ తెలిపారు. సింగరేణి సంస్థ ఆర్‌జి-3 ఓసీపీ-2 విస్తరణలో భాగంగా గ్రామంలోని 400 ఎకరాల విస్తీర్ణంలో గల వ్యవసాయ భూమి, 500 నివాస గృహాలను భూసేకరణ చేసి గ్రామాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకున్నారన్నారు. పునరావాసం కింద మంథని మండలం బిట్టుపల్లి గ్రామ శివారులో గల సర్వే నం.372/2లో 77ఎకరాల 20గుంటల భూమికి గ్రామాన్ని కేటాయించారన్నారు. ఇంటి నిర్మాణాలకు నివాస స్థలాలు కేటాయించడంతో నిర్మాణాలు చేసుకున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీని బిట్టుపల్లి శివారులో ఏర్పాటు చేయడానికి గెజిట్ నోటిఫికేషన్ కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించినట్లు తెలిపారు. రచ్చపల్లి పంచాయతీకి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని వినతిపత్రంలో కోరారు.

నత్తనడకన అభివృద్ధి పనులు

- కొనసాగుతున్న పనులతో రైల్వే ప్రయాణికుల ఇక్కట్లు


రైల్వేస్టేషన్ ప్రవేశద్వారం నుంచి వెళ్తున్న ప్రయాణికులు

రామగుండం: రామగుండం రైల్వేస్టేషన్ నుంచి దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు రైళ్లు నడుస్తాయి. ప్రతిరోజూ వేలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. గతేడాది ఆగస్టు 6న అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.కోట్ల నిధులతో ప్రధాని మోదీ వర్చువల్ విధానంలో రామగుండం రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. అయితే పదినెలలైనా నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా వాహనాలకు పార్కింగ్ చేసే స్థలం, ప్లాట్‌ఫాంపై తాగునీరు, ప్రయాణికులు వేచి ఉండే గదులు, వాష్‌రూమ్స్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాఆరు. ప్లాట్‌ఫాంపై ఎస్కలేటర్ నిర్మాణం, సాంకేతికపరమైన పనులు కొనసాగుతున్నాయి. ఆన్‌లైన్ అనౌన్స్‌మెంట్ నిలిచిపోవడంతో మ్యానువల్ పద్ధతిలో బోగీ నిలిచే ప్రదేశాన్ని మైక్‌లో చెప్పడంతో ప్రయాణికులకు అర్థం కావడం లేదు. రైల్వేస్టేషన్ ప్రాంగణం పూర్తిగా నిర్మాణ మెటీరియల్‌తో నింపివేయడంతో ఇరువైపులా రాకపోకలు సాగించే ప్రయాణికులు బండరాళ్లు గుచ్చుకొని గాయాలపాలవుతున్నారు. ఆటోలు, ఇతరత్రా వాహనాలు ప్రాంగణంలోకి వచ్చే పరిస్థితి లేకపోవడంతో బరువుతో కూడిన లగేజీతో ప్రయాణికులు రోడ్డుపైకి చేరేందుకు తిప్పలు పడుతున్నారు. అధికారులు స్పందించి సంబంధిత నిర్మాణ కాంట్రాక్టరుపై ఒత్తిడి పెంచి పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

నాణ్యమైన విత్తనాలను విక్రయించాలి

సాక్షి పెద్దపల్లి: రైతులకు నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని, నకిలీ విత్తనాలను అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పెద్దపల్లి మండల వ్యవసాయ అధికారి అలివేణి అన్నారు. పెద్దపల్లి పట్టణంలో శనివారం ఎరువుల దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించిన అనంతరం మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం విత్తనాలను అమ్మిన తర్వాత రికార్డులు నమోదు చేయడంతో పాటు రైతులకు రశీదులు ఇవ్వాలని సూచించారు. రైతులు పంట సాగు చేసే ముందు రైతు వేదికల వద్ద విస్తరణ అధికారులుంటారని, వారి సూచనల మేరకు పంటలను సాగు చేసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. అలాగే మండలంలోని చందపల్లి, తుర్కలమద్దికుంట, రాఘవాపూర్, బొంపల్లి, ముత్తారం, దస్తగిరిపల్లి గ్రామాల్లో విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో విస్తరణ అధికారులు, రైతులు ఉన్నారు.


పెద్దపల్లి: రికార్డులను తనిఖీ చేస్తున్న అలివేణి


ఎలిగేడు: అవగాహన కల్పిస్తున్న అధికారి ఉమాపతి

జాగ్రత్తలు తీసుకోవాలి

ఎలిగేడు: వచ్చే రబీ సీజన్‌లో రైతులు విత్తనాల ఎంపిక, కొనుగోలు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఎం.ఉమాపతి సూచించారు. మండలంలోని ధూళికట్ట, నర్సాపూర్, నారాయణపల్లి గ్రామాల్లో శనివారం రైతులకు విత్తనాల ఎంపికపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రైతులు విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో లూజుగా ఉన్న సంచుల్లోని విత్తనాలను కొనుగోలు చేయరాదని, విత్తనాలను కొనుగోలు చేసిన షాపు నుంచి రశీదును తీసుకోవాలన్నారు. వ్యవసాయశాఖ ద్వారా గుర్తింపు పొందిన అధీకృత డీలర్ వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని, విత్తనాల ఎంపిక సమయంలో ఏమైనా ఇబ్బందులు ఎదురైతే వ్యవసాయశాఖ అధికారుల సలహాలు తీసుకోవాలన్నారు. ఏఈవోలు గణేశ్, హుస్సేన్ పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

సుల్తానాబాద్: డీలర్లు, ఫెర్టిలైజర్ యజమానులు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి డేవిడ్ రాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఫర్టిలైజర్ యజమానులకు, డీలర్లతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజన్ ప్రారంభమయ్యే అవకాశం ఉన్నందున నకిలీ విత్తనాలు, ఎరువులు పట్టణాల్లో, గ్రామాల్లో అమ్మకాలు చేసేందుకు వస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. ఎస్సై శ్రావణ్‌కుమార్ ఉన్నారు.

పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహారం అందజేస్తున్న డాక్టర్ అలేఖ్య

కోల్‌సిటీ: గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జీజీహెచ్)లో శనివారం సీడ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు పల్లెర్ల రమేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో ఆరుగురు నిస్సహాయ పిల్లలకు, ఏఆర్‌టీ విభాగం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అలేఖ్య చేతుల మీదగా పౌష్టికాహారం అందజేశారు. గోదావరిఖనికి చెందిన ఆడెపు పద్మ, ఉపేందర్ దంపతులు వృత్తిరీత్యా అమెరికాలో ఉంటున్నారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న ఆరుగురు నిరుపేద చిన్నారులకు ఎస్ఆర్ఐ దంపతులు పంపించిన ఆర్థికసాయంతో నీడ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందించారు. కార్యక్రమంలో ఏఆర్‌టీ ఉద్యోగులు బి.శ్యామ్, కిస్మత్, రవి, శ్రీనివాస్, రాజేశ్, మమత, శ్రావణ్, రమేశ్, మధు, సరస్వతి పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు


ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభిస్తున్న ఏఈ శ్రీనివాస్

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం మేడిపల్లి ప్రాంతంలో లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను బిగిస్తున్నామని మేడిపల్లి ఎన్టీపీసీ విభాగం ఏఈ ఎ.శ్రీనివాస్ తెలిపారు. శనివారం కృష్ణానగర్‌లో కొత్తగా 100 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. లోవోల్టేజీ సమస్యను తీర్చడంతో ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. ప్రజల విద్యుత్ సమస్యలను పరిష్కరించేందుకు మరిన్ని కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల బిగింపు ప్రాంతాల ప్రజలు విద్యుత్ విభాగానికి సహకరించాలని కోరారు. విద్యుత్ లైన్ ఇన్‌స్పెక్టర్ నాగరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

భక్తాంజనేయస్వామికి వెండి కిరీటం బహూకరణ


కిరీటం బహూకరిస్తున్న భక్తులు

జూలపల్లి: మండల కేంద్రంలోని శ్రీభక్తాంజనేయ స్వామి ఆలయంలో కొలువుదీరిన శ్రీఅభయాంజనేయ స్వామికి జూలపల్లికి చెందిన భక్తులు దేవసాని శంకరయ్య-తార దంపతులు కిలో వెండితో తయారు చేసిన కిరీటం, శంఖుచక్రాలు బహూకరించారు. ఈ సందర్భంగా స్వామివారికి అలంకరణ చేశారు. హనుమాన్ మాలధారణ భక్తులకు అన్నదానం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ కొంజెర్ల వెంకటయ్య, ఆలయ కమిటీ సభ్యులు లోక లింగారెడ్డి, రమేశ్, అమరగాని ప్రదీపకుమార్ ఉన్నారు.

నీటి సరఫరాలో అంతరాయం

సాక్షి,పెద్దపల్లి: పట్టణంలో మరో రెండురోజుల పాటు నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు పురపాలక సంఘం కమిషనర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్గాం మండలం ముర్మూర్ మిషన్ భగీరథ గ్రిడ్ వద్ద ఏర్పడిన పైప్‌లైన్ లీకేజీ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్న క్రమంలో సోమవారం సాయంత్రం వరకు నీటి అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. నీటి సరఫరాలో ఏర్పడిన అంతరాయాన్ని ప్రజలు గమనించాలని కోరారు.

రోడ్డు వేశారు.. లైన్ మార్కింగ్ మరిచారు


లైన్ మార్కింగ్ లేని సుల్తానాబాద్ - నీరుకుల్ల డబుల్ రోడ్డు

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్ నుంచి నీరుకుల్ల గ్రామం వరకు డబుల్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. కానీ నెలలు గడుస్తున్నప్పటికీ లైన్ మార్కింగ్ వేయకుండానే వదిలేశారు. రూ.కోట్లు ఖర్చు చేసి డబుల్ బీటీ రోడ్డు చేపట్టారు. కాగా దానిపై వాహనాదారులు రోడ్డు నిబంధనలు పాటించేందుకు గాను రోడ్డు ఇరువైపులా కంటిన్యూస్ లైన్, రోడ్డు మధ్యలో బ్రోకెన్ వైట్ లైన్ వేయలేదు.

అనాథ వృద్ధులకు అన్నదానం

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ పోతనకాలనీకి చెందిన సదాశయ ఫౌండేషన్ సభ్యురాలు ఇందుసిరి పుట్టినరోజు సందర్భంగా అనాథ వృద్ధులకు అన్నదానం చేశారు. ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ టెస్టులో జాతీయస్థాయి ర్యాంక్


వైష్ణవి

గోదావరిఖనిటౌన్: ఇటీవల నిర్వహించిన నేషనల్ ఒలింపియాడ్ సెమ్స్ టాలెంట్ టెస్ట్ పోటీల్లో స్థానిక గీతాంజలి పాఠశాలకు చెందిన మొగురం వైష్ణవి జాతీయస్థాయిలో 2వ ర్యాంకు సాధించిందని సెమ్స్ ఒలంపియాడ్ కన్వీనర్ అరుకాల రామచంద్రారెడ్డి తెలిపారు. అలాగే 9వ తరగతి చదువుతున్న కె.యజ్ఞేశ్వర్ రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంకు, 6వ తరగతి చదువుతున్న గాజుల స్ఫూర్తి 6వ ర్యాంకు, కొక్కుల ఆశ్రిత 10వ ర్యాంకు (6వ తరగతి), తాళ్ల సహస్ర 8వ ర్యాంకు (3వ తరగతి), కె.తేజశ్రీ, 9వ ర్యాంకు (3వ తరగతి) సాధించారని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతిభ కనబర్చడంపై సెమ్స్ ఒలంపియాడ్ కోఆర్డి నేటర్ ఎస్ఎన్ రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ కంది రవీందర్‌రెడ్డి అభినందించారు.

గీత కార్మికుడికి గాయాలు

ఓదెల: మండలంలోని మడకకు చెందిన గీతకార్మికుడు మ్యాడగొని మొగిలిగౌడ్ శనివారం తాటిచెట్టు పైనుంచి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. రోజువారీలాగే కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కి కిందకు దిగుతున్నాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు జారిపడటంతో ఎడమకాలు విరిగింది. చేతులు, వీపుభాగంలో గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే కరీంనగర్‌లోని ఓ ఆస్పత్రికి తరలించారు.

రెండురోజులు తాగునీటి సరఫరా నిలిపివేత


పునరుద్ధరణ పనులు చేస్తున్న కార్మికులు

రామగుండం: బ్రాహ్మణపల్లి మిషన్ భగీరథ కేంద్రం నుంచి ముర్మూర్ వైపు వచ్చే పైపులైన్ లీకేజీతో శని, ఆదివారాల్లో తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు ముర్మూర్ గ్రామ పంచాయతీ సిబ్బంది తెలిపారు. మల్రిపల్లి గ్రామ శివారులో మిషన్ భగీరథ పైపులైన్ పునరుద్ధరణ పనులు జరుగుతున్నాయి.

ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి


మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

- అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్
- 'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్..

జూలపల్లి: వర్షాకాలం ప్రారంభమైనందున ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ ఆదేశించారు. సాక్షి దినపత్రికలో 'పేరుకు పోతున్న ధాన్యం' కథనానికి స్పందించి జిల్లా సివిల్ సప్లయ్ మేనేజర్ శ్రీకాంత్‌తో కలిసి జూలపల్లి కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. రైతులు, హమాలీ కార్మికులు, కేంద్రం నిర్వాహకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తూకం వేసిన ధాన్యం మిల్లుకు చేరే వరకు నిర్వాహకులే బాధ్యత తీసుకోవాలని సూచించారు. వర్షానికి కవర్లు వేసి రైతుల ఇబ్బందులు తొలగించాలన్నారు. హమాలీ కార్మికుల కొరత లేకుండా వెంటనే తూకం వేయాలని, లారీలతో మిల్లులకు సరఫరా చేయాలని ఆదేశించారు. కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. తహసీల్దారు బషీరుద్దీన్, ఆర్ఐ సదయ్య, మాజీ ఉపసర్పంచ్ కొప్పుల మహేశ్, సెంటర్ సీఈవో సురేశ్ తదితరులు ఉన్నారు.

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


సమస్యలు తెలియజేస్తున్న రవీందర్‌రెడ్డి

రామగిరి: ఆర్జీ-3 డివిజన్‌లోని సింగరేణి కార్మికుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని శనివారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ఆర్జీ-3 డివిజన్ ఐఎన్‌టీయూసీ వైస్ ప్రసిడెంట్ కోట రవీందర్‌రెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు. సెంటనరీకాలనీలో ప్రధానంగా తాగునీటి సమస్య నెలకొందని, నీటి కొరతతో అపరిశ్రుభమైన నీటితో తాగునీటి సమస్య ఏర్పడిందని వెంటనే పరిష్కరించాలని కోరారు. సెంటనరీకాలనీ నుంచి గోదావరిఖని వెళ్లే ప్రధాన రహదారిపై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేస్తూ రోడ్డు మరమ్మతు పూర్తి చేసేలా సంబంధిత అధికారులను ఆదేశించాలని మంత్రిని కోరినట్లు ఆయన పేర్కొన్నారు. స్పందించిన మంత్రి వెంటనే సీఅండ్ఎండీ బలరాం నాయక్‌తో మాట్లాడి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. సెంట్రల్ లైటింగ్ సిస్టంతో పాటు రోడ్డు వేయాలని కోరగా సీఅండ్ఎండీ సానుకూలంగా స్పందించినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు.

వర్షాకాలం పంటల సాగుపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఏవో

రామగుండం: రాబోయే వర్షాకాలంలో సాగు చేసే పంటల రకాలపై మండల వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో శనివారం పలు గ్రామాల్లో రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి బూక్య రాంబాబు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. అధీకృత డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలని, వర్షాకాలం పంట సాగు రకాలపై రైతులు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. కాగా రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు చెందిన రశీదులను పంట దిగుబడి పొందే వరకు జాగ్రత్తగా భద్రపరచుకోవాలని సూచించారు. అధీకృత డీలర్ల వద్ద విత్తనాలు ప్యాకెట్లలో ఉన్న వాటినే కొనుగోలు చేయాలని, విడిగా కొనుగోలు చేయరాదన్నారు. అనంతరం విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించిన ఏవో రైతులకు విక్రయించిన విత్తనాల రకాలను తదితర వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అంతర్గాం మండల పరిధిలోని విలేజి అంతర్గాం, పొట్యాల, విసంపేట గ్రామాల రైతులు, మండల విస్తీర్ణాధికారులు, హరీశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

'రైస్‌మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి'


వినతిపత్రం అందజేస్తున్న మహేశ్

రామగుండం: వరిధాన్యం కొనుగోలు విషయంలో రైతులను నష్టపరిచే విధానాలను అవలంబిస్తున్న రైస్‌మిల్లర్ల యజమానులపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరుతూ శనివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ఠాకూర్ ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరా శాఖ అధికారి ప్రేమ్‌కుమార్‌కు కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పెండ్యాల మహేశ్ ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల వారీగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటికే 90శాతం పూర్తి చేసినప్పటికీ పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఇంకా ధాన్యం నిల్వలు ఉన్నాయి. సదరు గ్రామాలకు కేటాయించిన రైస్ మిల్లర్ల యజమానులు వివిధ రకాల కారణాలతో బస్తాకు రెండు కేజీలు కోతపెట్టి కొనుగోలు చేస్తున్నారని, ఇదేంటని ప్రశ్నించే వారి ధాన్యం కొనుగోలులో ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. తూకం వేసిన ధాన్యం బస్తాలు కేంద్రాల నుంచి మిల్లుకు తరలించడంలో జాప్యం జరుగుతుండడంతో అకాల వర్షాలకు రైతులు నష్టపోతున్నారు. వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని పెద్దంపేట, ఎల్లంపల్లి కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని సత్వరమే సంబంధిత మిల్లర్లు తెప్పించుకునేలా ఆదేశాలు జారీ చేయాలని డీఎస్‌వోకు విన్నవించారు. కాంగ్రెస్ ప్రతినిధులు మేర్గు కుమార్‌గౌడ్, పల్లె రవీందర్, విజయేందర్‌రెడ్డి, వేముల విజయ్, పెండ్యాల వెంకటేశ్, కల్యాణ్ ఉన్నారు.

ఆలయంలో అన్న మహాప్రసాదం పంపిణీ

జ్యోతినగర్: శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో భక్తులకు శనివారం అన్న మహాప్రసాదం పంపిణీ చేశారు. ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని భక్తాంజనేయ ఆలయంలో గోదావరిఖనికి చెందిన జక్కం స్వరూప-కుమార్ దంపతులు ఆంజనేయస్వామి భక్తులకు అన్న మహాప్రసాదాన్ని అందించారు. ఆలయ అర్చకులు చెరుకు సురేశ్‌శర్మ పూజలు చేశారు. సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకట్‌రాజ్, బజరంగ్‌దళ్ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు అడ్డుకున్న గ్రామస్తులు

రామగిరి: మండలంలోని నాగెపల్లి క్రాస్‌రోడ్ వద్ద ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ పనులను శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. ఎలాంటి సమాచారం లేకుండా విస్తరణ పనులు చేపట్టారని ఆందోళన నిర్వహించారు. సంబంధిత అధికారులు వచ్చి మార్కింగ్ చేసిన అనంతరం విస్తరణ పనులు చేపట్టాలని ఆందోళన చేశారు. అయితే పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు.